క్లుప్తంగా

ప్రజలు సహకరించాలి



మహబూబాబాద్: అభివృద్ధి పనుల విషయంలో ప్రజలు అన్ని విధాలా సహకరించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలో నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక వరకు కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు పలు కారణాలతో నిలిచిపోయాయి. కాగా బుధవారం ఎమ్మెల్సీ, అధికారులు రోడ్డును పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోను కలిసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

డోర్నకల్: డోర్నకల్ కమిషనర్‌గా నియమితులైన వెంకటస్వామి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన నరేష్‌రెడ్డి మరిపెడ మున్సిపాలిటీకి బదిలీ ఆయ్యారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తమ విధి నిర్వహణ సమయంలో అందించిన సేవల ఆధారంగా మంచి గుర్తింపు వస్తుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందుతున్న ఏ.నరహరిని ఎస్పీ బుధవారం సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయప్రతాప్, ఆర్ఐలు అనిల్, నాగేశ్వర్రావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



గూడూరు: ప్రతీ ఒక్కరు వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని ఎస్సై గిరిధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో బుధవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



తల్లీకూతుళ్లు

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెంకు చెందిన హెచ్.స్వప్న తన ఇద్దరు కూతుళ్లను తీసుకొని హైదరాబాద్‌కు బయలుదేరి ఇంటికి చేరకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. పడమటిగూడెం నుంచి ఈనెల 16వ తేదీన స్వప్న తన కూతుళ్లు దీక్ష, నిఖితలను తీసుకొని హైదరాబాద్‌లో ఉంటున్న భర్త వద్దకు బయలుదేరింది. తన వద్దకు రాలేదని స్వప్న భర్త కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్వప్న అక్క మందుల మనిత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్కపై తమ్ముడి దాడి

మరిపెడ రూరల్: ఓ తమ్ముడి వివాహేతర సంబంధంపై నిలదీసినందుకు మరో తమ్ముడు తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం.. ఎడ్జెర్ల గ్రామానికి చెందిన బత్తిని రామతార పెద్ద కూతురు అనితను సొంత తమ్ముడైన చిత్తనూరి మల్లేశానికి ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేసింది. ఈ నేపథ్యంలో మల్లేశం మరో యువతితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి అతడిని నిలదీసింది. ఈ క్రమంలో మరో తమ్ముడైన చిత్తనూరి లింగన్న తన కుటుంబ సభ్యులతో కలిసి అక్క ఇంటి మీద దాడి చేశాడు. రామతారపై రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. ఈ విషయంపై దాడికి పాల్పడ్డ ఐదుగురి వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు రామతార తెలిపింది.

సంఘాల పేరుతో బడికి ఎగనామం

మరిపెడ రూరల్: పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సంఘాల పేరుతో బడికి ఎగనామం పెట్టి, పేద పిల్లలకు అన్యాయం చేస్తున్నారని టీఎస్ యూటీఎఫ్ మరిపెడ మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి ప్రభాకర్ ఆరోపించారు. ఈమేరకు బుధవారం ఆయన మాట్లాడారు.

33రకాల సన్నాలకు బోనస్

- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- వరిధాన్యం సన్నరకాల జాబితా విడుదల
- గింజ పొడవు, వెడల్పు ఆధారంగా బోనస్ చెల్లింపు
- కొనుగోలు కేంద్రాల వద్ద మైక్రోమీటర్ల ఏర్పాటు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు కాంటా పెడుతున్న హమాలీలు (ఫైల్)

మరిపెడ రూరల్: వానాకాలం సీజన్ నుంచి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. అయితే సన్న ధాన్యంలో చాలా రకాలు ఉండడంతో ఏయే రకానికి బోనస్ వర్తిస్తుందోనని రైతులు చర్చించుకుంటున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం బోనస్ చెల్లింపుపై మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో 33 సన్న రకాలకు బోనస్ చెల్లించనున్నారు. ఇప్పటికే జిల్లాలో పౌర సరఫరాల శాఖ ధాన్యం సేకరణ ప్రారంభించింది.

గింజ పొడవు, వెడల్పు ఆధారంగా..

సన్నాల్లో 33 రకాలకు ఈ పథకాన్ని వర్తింపజేయనుంది. ధాన్యం గింజ పొడవు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనేది తెలుసుకోవడానికి ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఈసారి మైక్రోమీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి పొడవు 6మిల్లీమీటర్లు, కంటే తక్కువ, వెడల్పు 2మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలని నిబంధనలు ఉన్నాయి. ఇలాంటి రకాలు 33 రకాలను గుర్తించి వాటికి మాత్రమే బోనస్ ఇచ్చేందుకు ప్రభుత్వం జాబితాను రూపొందించింది. ధాన్యం తేమ 17శాతానికి మించినప్పుడు మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని భావిస్తుంది.

జిల్లాలో 1.94 లక్షల ఎకరాల్లో వరిసాగు

జిల్లాలో ఈ వర్షాకాలం సీజన్‌కు సంబంధించి 1.94లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సీజన్ ప్రారంభంలో వర్షాలు సకాలంలో లేకపోవడంతో వరిసాగు తగ్గుతుందని భావించినప్పటికీ ఆ తర్వాత వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండుకోవడంతో పాటు భూగర్భజలాలు అమాంతం పెరిగిపోవడంతో వరిసాగు మరింత పుంజుకుంది. అసెంబ్లీ ఎన్నిల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు సన్నాల సాగుకు మొగ్గు చూపినట్లు వ్యవసాయి అధికారులు వెల్లడించారు.

ఈఆర్సీ తిరస్కరించడం బీఆర్ఎస్ విజయమే



మహబూబాబాద్: కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచాలని చేసిన ప్రయత్నాన్ని శాస్త్రీయంగా ఈఆర్సీ ముందు మాజీ సీఎం కేసీఆర్ ఉంచడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, ఆ ఘనత కేసీఆర్‌దే అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నెహ్రూసెంటర్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రూ 18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపే ప్రయత్నం చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, రవికుమార్, ఎడ్ల వేణు మాధవ్, కన్నా, వెంకన్న రాజశేఖర్ పాల్గొన్నారు.

తొర్రూరు: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) తిరస్కరించడం బీఆర్ఎస్ విజయమేనని పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మంగళపల్లి శ్రీనివాస్, కాలునాయక్, వీరభద్రరావు, కుర్ర శ్రీనివాస్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, ఎన్నమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెల్లికుదురు: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకన్న, వెంకటేశ్వరరెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం



మాట్లాడుతున్న శ్రీనివాస్

మరిపెడ: ఒకే దేశం–ఒకే ఓటు నినాదంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్నారని, జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు దుండి వీరన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసమావేశానికి హాజరైన సాధుల శ్రీనివాస్ మాట్లాడారు. జమిలి ఎన్నికల పేరుతో దేశంలో మతకల్లోలం సృష్టించడానికి జేబీపీ ప్రభుత్వం కుట్రచేస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చడంతో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య, నాయకులు బాణాల రాజన్న, నందిపాటి వెంకన్న, గుండగాని మధుసూదన్, కొండ ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ డాక్టర్‌ను నియమించాలి

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో రాత్రి సమయంలో డ్యూటీ డాక్టర్‌ను వెంటనే నియమించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గార్లలో పేరుకే 30 పడకల పెద్ద ఆస్పత్రి కాని, రాత్రి సమయంలో ఒక్క డాక్టర్ సైతం ఉండక పోవడంతో రాత్రివేళ అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. సీహెచ్‌సీలో ఉన్న ముగ్గురు డాక్టర్లు సైతం డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా డీసీహెచ్ఓ లు స్పందించి రాత్రి సమయంలో ఒక డ్యూటీ డాక్టర్‌ను నియమించాలని ఆయన కోరారు. ఈ సమావేశం వెంకన్న, రాగం రమేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

గార్ల: మద్యం మత్తులో గడ్డి కలుపు మందు తాగిన వృద్ధుడు నల్లగంటి సత్యం(70) మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ తెలిపారు. గార్ల మండలం కొత్తపోచారం గ్రామానికి చెందిన సత్యం భార్య తరచూ కూతుళ్ల వద్దకు వెళ్లడంతో, జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కూతురు ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కాంగ్రెస్ పటిష్టతకు నాయకుల కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బయ్యారంలోని కోదండరామచంద్రస్వామి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో చర్చ పెట్టాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ముసలయ్య, ఏఎంసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, నాయకులు కిషన్‌నాయక్, రాము, సోమేష్, రాంమూర్తి, ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో బయ్యారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, మండల పరిషత్ సూపరింటెండెంట్ దైవాధీనం పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలి



అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేయాలని, చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్ల ప్రకారం తమ వాట తమకు ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని త్రివేణి నిలయంలో మంగళవారం రాత్రి సంఘ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కట్ల విష్ణు, బీసీ ఐక్య సంఘాల అధ్యక్షుడు వేముల వెంకన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, శ్రీధర్, వేణు, సోమన్న, మోహన్‌రావు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

గార్ల: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గార్ల పురవీధుల్లో గ్రామ పంచాయతీ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి మాట్లాడారు. జీఓ నంబర్ 51ను వెంటనే సవరించాలని, ప్రతీ కార్మికుడికి కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ మంగమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, కార్మికులు పిడమర్తి దాసు, దస్తగిరి, ఉపేందర్, రమేష్, విజయ, దేవీలాల్, కృష్ణ, దయాకర్, వెంకటేశ్వర్లు, సైదులు, సువర్ణ, భాష్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



నర్సింగ్ విద్యార్థినులతో అధికారులు

మహబూబాబాద్ అర్బన్: నర్సింగ్ విద్యార్థులు సేవా దృపథం కలిగి ఉండాలని జిల్లా వైద్యశాఖ ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య ఒకేషనల్ కళాశాలలో బుధవారం క్యాపింగ్‌సెర్మని వేడుకలకు డాక్టర్ సారంగం హాజరై మాట్లాడారు. నర్సింగ్ వృత్తి పవిత్రమైందని, అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు నర్సింగ్ క్యాపులు, ఆప్రానులను జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ విద్యార్థుల అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఇరపనూరి పుల్లన్న, వైస్ ప్రిన్సిపాల్ తిరుమలేష్, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎల్లయ్య

నెహ్రూసెంటర్: నవంబర్ 5వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని సంఘం జాతీయ కార్యదర్శి కొంంద్ర ఎల్లయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టాలని, అంబేడ్కర్ సహాయ నిధి పథకం ద్వారా దళితులకు రూ.12లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సైకిల్, పాదయాత్రలు చేపట్టనున్నామని కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. వర్గీకణ పూర్తయ్యే వరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని కోరారు. ఈ సమావేశంలో పులి శ్రీను, రాధా, సతీష్, రాజు, ప్రశాంత్, చంటి, భాగ్యమ్మ, సంధ్య పాల్గొన్నారు.

పాదయాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మరిపెడ: మాలలు చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేద్దామని జేఎంఎం జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ పిలుపునిచ్చారు. ఈమేరకు మరిపెడలో మంగళవారం మాలల మహా పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ యాత్ర నేడు మరిపెడకు చేరుకుంటుందన్నారు. జిల్లాలో మూడు రోజులపాటు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే శక్తులంతా కదలి వచ్చి స్వాగతం పలకాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, మండల అధ్యక్షుడు గుమ్మడి ప్రభాకర్, చంద అశోక్, మెరుగు సంజీవ, సంజీవరావు, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు జీవాల మృతి



జుజుర్‌తండాలో మృతిచెందిన ఎద్దులు

కురవి: పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని మోద్గులగుడెం శివారు జుజుర్‌తండా జీపీలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన దరావత్ హేమసుందర్ అనే రైతు, తన రెండు ఎద్దులను మేత మేపేందుకు వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఉరుములు మెరుపులతో వర్షం మొదలుకాగా, ఒక్కసారిగా పిడుగుపడటంతో ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ రూ.2లక్షలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పాడిగేదె మృతి..

మొగిలిచర్ల గ్రామానికి చెందిన ఇరుకులపాటి నర్సయ్య అనే రైతుకు చెందిన గేదెలను మేత కోసం చేను వద్దకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో పిడుగుపడడంతో గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపాడు.

సంక్షిప్త సమాచారం

వినియోగదారులకు మెరుగైన సేవలు

నెహ్రూసెంటర్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు 1912 టోల్ ఫ్రీం నంబర్‌ను సంప్రదించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ జె.నరేష్ బుధవారం తెలిపారు.

రిజర్వేషన్ అమలు చేయాలి

గూడూరు: ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజనేతరుల (నాన్ ట్రైబల్స్)కు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని నాన్ ట్రైబల్ కన్వీనర్ కత్తి స్వామి కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన నాన్ ట్రైబల్ కమిటీ ప్రతినిధులతో కలిసి తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సురేందర్, వేణుమాధవ్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

వర్తక సంఘం బలోపేతానికి కృషి

తొర్రూరు: వర్తక సంఘం బలోపేతానికి కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన తొర్రూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో గెలుపొందిన ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మచ్చ సురేష్, ప్రధాన కార్యదర్శి తల్లాడి హీరాధర్, కోశాధికారి చిదురాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రానికి చెందిన ఎంఎస్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారం అందుకుంది. హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన హైదరాబాద్‌లో త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో అవార్డును అందజేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: ఫిజియోథెరపి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నిషాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో దివ్యాంగులైన చిన్నారుల కోసం ఫిజియోథెరపి క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు వీరేందర్, మంగీలాల్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

నెహ్రూసెంటర్: దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ఏదేని ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే 108ని సంప్రదించాలని 108 రాష్ట్ర ఆపరేషన్స్ హెడ్ ఖలీద్ బుధవారం తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం, బావోజిగూడెం గ్రామాల్లోని పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి బుధవారం పంపిణీ చేశాడు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మహబూబాబాద్: నారాయణ నగర్‌కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశాడు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రజాక్, సైదులు, దేవేందర్, మధు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

గూడూరు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బానోతు కార్తీక్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ మంహకాళి బుచ్చయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలను, దుబ్బతండాలోని డీఎస్‌టీ పీఎస్ పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని, నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని సూచించారు.

పేదలకు అండగా కాంగ్రెస్

కురవి: పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లెల్ల గ్రామంలో సీరోలు మండలం ఉప్పరిగూడెం, కొత్తూరు(సీ) గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

జాతీయ సమగ్ర దినోత్సవం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సమగ్ర, సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి దినోత్సవం వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మణ్ నాయక్, అధ్యాపకులు నిర్వహించారు.

దీపావళి శుభాకాంక్షలు

మరిపెడ రూరల్: నేడు దీపావళి పండుగను పురస్కరించుకొని డోర్నకల్ నియోజక వర్గ ప్రజలందరికి ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపాడు.

ఎమ్మెల్సీ గెలుపునకు కృషి చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని డాక్టర్ కొలిపాక వెంకటస్వామి కోరారు. జిల్లా కేంద్రంలోని బీసీ గురుకులం పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు నాగముని, రవి, రఫీ, జీవన్, సురేష్ పాల్గొన్నారు.

6నుంచి సమగ్ర కుటుంబ సర్వే

పెద్దవంగర: వచ్చే నెల 6నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టనున్నట్లు ఎంపీడీఓ వేణుమాధవ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో తహసీల్దార్ మహేందర్‌తో కలిసి మండలంలోని పలు విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమగ్ర కుటుంబ సర్వే చేయూ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ లస్కర్, మిషన్ భగీరథ ఏఈ యాకుబ్‌పాషా, పీఆర్ఏఈ దయాకర్, ఏపీఎం రమణాచారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: ఇంటింటా సర్వేను నిక్షిప్తంగా నిర్వహించాలని తహసీల్దార్ కాటం చంద్ర రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన ఇంటింటా సర్వే కార్యక్రమంలో మాట్లాడారు. సర్వేను డీఎల్పీఓ పుల్లారావు పరిశీలించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కురవి: పర్యావరణాన్ని పరిరక్షించాలని నాగార్జున విద్యాలయం కరస్పాండెంట్ భూక్యరవికవిత అన్నారు. బుధవారం దీపావళి పర్వదినోత్సవం సందర్భంగా టపాసుల కాల్పులు, వాటి పర్యావసనం, కాలుష్య నివారణ కోసం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి గుడి సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు.

సబ్‌స్టేషన్‌ను వేరేచోటుకు మార్చాలి

కేసముద్రం: విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో కాకుండా, మరోచోట నిర్మించాలంటూ కేసముద్రంవిలేజ్ శివారు చైతన్యనగర్ కాలనీవాసులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో, విద్యుత్ ఎస్ఈకి, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు.